



# బోణీ బేరం
## స్నేహతనంటే

"అమ్మా! ఆకలేస్తుందే! టీ తాగుదామే!"

లక్ష్మి చీరకొంగు గుంజుతూ అడిగాడు రంగడు మోకాళ్ళమీదికి జారిపోతున్న నిక్కరు పైకెగలాక్కుంటూ!

"పైసల్లేవురా! ఇంకా బోణీకాలా! దారమ్మట ఒక్క కారూ రాకపోయె!" అంది లక్ష్మి.

"పోనీ తాతయ్య కొట్లో చక్కిలాలు తీసుకొందామే!"

"పొద్దున్నే చక్కిలాలు తింటే రోగమొస్తది! కొంచెమాగు."

బొచ్చు కుక్కపిల్ల వీపు నిమురుతూ కూర్చున్నాడు రంగడు.

సైకిల్ మీదపోతున్న ఒక నడివయసు ఆసామీ ఆగి "కుక్కపిల్లని అమ్ముతావా?" అని అడిగాడు లక్ష్మిని.

ఆమె మాట్లాడకపోయేసరికి "పదిరూపాయలిస్తా! నీదగ్గరుంటే తిండిలేక అది రేపోమాపో హరీ మంటుంది" అన్నాడు.

"మరో పదిప్పించండి! కూటికి లేనోళ్ళం" అంద లక్ష్మి.

పన్నెండు రూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టి కుక్కపిల్లను తీసుకెళ్ళాడతను.

తల్లీ కొడుకూ వెళ్ళి బన్ను తిని టీతాగి వచ్చారు.

కారు హారన్ వినపడగానే రివ్వున దూసుకుంటూ పరిగెత్తాడు రంగడు.




"క్రీక్" మని చప్పుడు చేసుకుంటూ ఆగింది అంబాసిడర్ కారు! నేలమీద పడి దొర్లుతున్నాడు రంగడు.

"కార్లో ఎక్కగానే కళ్ళు మూసుకుపోతయ్!"

"రోడ్డు మీద మనుషులు నడవక్కర్లా."

"చూస్తారేం! బయటకు లాగి నాలుగు తన్నండి" తల కొకమాట అన సాగారు చుట్టూరా మూగిన జనం.

లబ్బున మొత్తుకుంటూ ఏడవసాగింది లక్ష్మి. "అయ్యో! అప్పుడే నూరేళ్ళు నిండినయ్యా చిట్టి తండ్రీ! ఇంకనే నెట్లా బతికేదే! కారు నా మీదయినా పోయిందికాదే!"

నెమ్మదిగా డ్రైవరు టీ కొట్టతన్ని పక్కకు తీసికొని వెళ్ళి ఏదో మాట్లాడాడు. టీ కొట్టతను వచ్చి "లక్ష్మమ్మా! ఏడవ మాక యాభై రూపాయలు ఇస్తానని వొప్పుకున్నాడు. ఆ డబ్బు తీసుకొని హాస్పిటల్లో చేర్పించు రంగడ్ని" అన్నాడు.

"బిడ్డపడిపోయి నే నేడుస్తుంటే డబ్బులెందుకయ్యా?" అంటూనే డ్రైవర్ చేతిలోపెడుతున్న నోట్లను బొడ్లో దోపుకుంది.

కారు వెళ్ళిపోగానే జనం ఎటువాళ్ళు అటు వెళ్ళారు.

లక్ష్మిపోయి రంగడ్ని లేవదీసి నెమ్మదిగా నడిపించుకొని నిద్రగన్నేరు చెట్టుకిందకు జేర్చింది.

"బాగా దెబ్బ తగిలిందా?"

"లేదే! కిందపడ్డప్పుడు తల దిమ్మెరపోయింది. కళ్ళు తిరుగుతున్నయి."

"తలకి తడిగుడ్డ చుడతానుండు! యియ్యాల బోణీ మంచిదే!"

తోకాడించుకుంటూ బొచ్చుకుక్కపిల్ల వచ్చింది. కుక్కపిల్లను ఎత్తుకొని ముద్దు పెట్టుకొన్నాడు రంగడు.

టీ కొట్లో. బన్ను బిస్కట్లు టీతాగి బయల్దేరారు తల్లీకొడుకూ! వెంబడే కుక్కపిల్లా!

పొద్దున కొనుక్కు వెళ్ళినతను ఏమరుపాటున వుండటం చూసి పరిగెత్తుకొని వచ్చింది కుక్కపిల్ల!

ఇక ఆ ప్రాంతాలలో కనపడకూడదు అని నిర్ణయించుకొని బిచాణా మరో పేటకు మార్చేశారు!

రాత్రి పార్కులో పడుకున్నారు లక్ష్మి, రంగడూ! నిశిరాత్రివేళప్పుడు సుబ్బడొచ్చాడు.

"ఏందే యియ్యాళబేరం బాగాదొరికిందా ఏంది యవారం" అంటూ.

వాణ్ణి చూడగానే మూతి మూడు వంకరలు తిప్పి "నిన్ను వాలుకుల్లో బెట్టా! ఇక్కడకీ తయారయ్యా!" అంది లక్ష్మి.

పక్కనే పడుకుంటూ "పెళ్ళాం దగ్గరకు రాక ఎక్కడకు పోతానే? చెప్పు!" అంటూ "ఏరా రంగా యియ్యా లేమాత్రం దొరికింది" అని అడిగాడు.

వాడు నిద్ర పోయాడని తెల్సుకొని "ఓరినీ అప్పుడే నిద్రపోయావా!" అంటూ లక్ష్మి వంటిమీద చేయివేయబోయాడు.

"ఓరి సచ్చినోడా! ఇందుకు తప్ప ఎందుకూ పనికిరావుగా" అంటూ కసురుకొంది.

* * *

తెల్లవారుతుండగా లేచి బొడ్లో తముడుకుంది అలవాటు ప్రకారం!

డబ్బులు గల్లంతయినయి. "ఇ దాసచ్చినోడిపనే" అనుకుంటూ ఉస్సురంది.

మళ్ళీ కాలే కడుపులకోసం మండే గుండెలు తిప్పలు పడాలి! నిన్నటి కష్టార్జితం కల్లు పాకకు జేరుకుంటు దీపాటికి!

కుక్కపిల్ల "భౌ" మంటూ తిరుగ సాగింది. రంగడు లేచి కళ్ళు నులుముకుంటూ కూర్చున్నాడు.

"ఇడ్లీ తిందామే!"

తల్లి సమాధానం చెప్పకపోయేసరికి ఒక క్షణం ఆగి "అమ్మా పైసలియ్యే! ఇడ్లీ తింటాను" అన్నాడు.

"పైసల్లేవురా" తల దించుకునే అంది.

"నిన్న అన్ని పైసలు దొరికినయిగదా? లేవంటావేం?"

లక్ష్మి కంట్లోంచి నీటి బిందువులు జవాబుగా వచ్చాయి. పరిస్థితి అర్థం అయింది రంగడికి.

"అమ్మా ఆకలిగా లేదే!" తల్లిని ఓదార్చటాని కన్నట్లు అన్నాడు.

రోడ్డు జంక్షన్ దగ్గర చేరారు.

"అమ్మా పెద్దకా రొస్తాందే!"

ఎవరో వున్న మారాజుది కాబోలు బెంజి కారు, నెమ్మదిగా వస్తున్నది రోడ్డంట, 'యీ మురికిలో కదిలితేనే మైలపడతా' నన్నట్లూ.

"క్రీక్" మంటూ చప్పుడు చేస్తూ ఆగింది కారు. కారు ముందు పడి దొర్లుతున్నాడు రంగడు.

రోడ్డు మీద ఎవరూ జనం మూగలేదు. ఆ సమయంలో జనం అట్టే వుండరు!

కారులోంచి గబగబా దిగిందొకామె! పట్టుచీరె గరగరలాడిస్తూ నడిచి వచ్చి రంగడి ముందు నుల్చుని "వాట్ ఎ స్వీట్ కిడ్!" అంటూ ఎత్తుకుని వెళ్ళి కారులోకూర్చుంది.

కారులో ఎక్కుతుండగా రంగడు తల్లికి సైగ చేశాడు 'భయపడకు తిరిగి వస్తానంటూ'.

డ్రైవర్ వచ్చి లక్ష్మి చేతిలో పచ్చ నోటుంచి వెళ్ళిపోయాడు!

అయోమయంగా చూసింది లక్ష్మి నోటు వంక. శబ్దం చేయకుండా దూసుకుపోయింది కారు!

కాని రంగడు తిరిగి తల్లివడి చేరలేదు! ఆమె బొడ్లో పచ్చనోటు ఎప్పుడో ఖర్చయిపోయింది!

ఏ వీధిలో వున్నా ఆశగా దారిన పోయే కార్లలోకి చూస్తూ వుంటున్నది రంగడు కనపడతాడేమోనని!

ఆమెను వదలకుండా బొచ్చుకుక్కపిల్ల వెంబడే తిరుగుతూంది!

రంగడు తిరిగే కారు రంగు టద్దాలు బయటి మనుషులకు లోపలి రూపాలను కనపడనీయవన్న సంగతి లక్ష్మికి తెలియదు పాపం!

ఎవరైనా జాలిపడివేసే పైసలు తప్ప సరైన ఆదాయం లేకపోవడంతో రాత్రిళ్ళు వేధించటానికి సుబ్బడూ రావడంలేదు!

మిగిలింది బొచ్చుకుక్కపిల్ల ఒకటే! ●